క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలపల్లి: మండలంలో ప్రసిద్ధి గాంచిన పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం వరకు గ్రామం నుంచి మెటల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కంకణాల జ్యోతిబసు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్ ఎమ్మెల్యే విజయరమణరావుకు వినతిపత్రం అందజేశారు. ఎలిగేడు మండలంలోని ఎమ్మెల్యే స్వగృహం శివపల్లిలో కలిసి ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే నిధుల మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు అల్లాడి శేఖర్, పెసరు స్వామి ఉన్నారు.

మ్యూజియం సందర్శన



తిలకిస్తున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మ్యూజియంను మంగళవారం మండలంలోని పెద్దకల్వల గ్రామంలో గల నోబెల్ హైస్కూల్ విద్యార్థులు సందర్శించారు. ప్రతి మంగళవారం పాఠశాల విద్యార్థులు కలెక్టరేట్ మ్యూజియం తిలకించేలా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శన కార్యక్రమాన్ని రూపొందించిన విషయం విదితమే. నోబెల్ పాఠశాల విద్యార్థులంతా మ్యూజియం తిలకించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

కళాశాలలో వార్షికోత్సవం

మంథని: మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు తమ ఆటాపాటలతో ఆహుతులను అలరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తాహెర్ హుస్సేన్, కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సలీంతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజ్‌లో ఫేర్‌వెల్ డే



నృత్యం చేస్తున్న బాలికలు

ముత్తారం: ముత్తారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం ఫేర్‌వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫస్ట్ ఇయర్ విద్యార్థులు వీడ్కోలు పలికారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఎస్.కె.లాయక్ అలీ, అధ్యాపకులు జీఎల్ఎస్ రావు, రాజేశం, శ్రీనివాస్, చంద్రమౌళి, లింగమూర్తి, జయ, జెరూషా, బన్సీలాల్, సంపత్, రాజు పాల్గొన్నారు.

గాయత్రీ విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సైంటిఫిక్ అప్టిట్యూడ్ టెస్ట్ ఇంటర్ స్టేట్ ఒలింపియాడ్‌లో బూసారపు వీక్షిత్ అనే విద్యార్థి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచి ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ అభినందించారు. పోటీతత్వం, పరీక్షలపై అవగాహన, విషయ పరిజ్ఞానం పెంపొందించాలనే ఆలోచనతో విద్యార్థులు ఒలింపియాడ్ పరీక్షలు రాసేలా ప్రోత్సహిస్తున్నామని శ్రీనివాస్ పేర్కొన్నారు. కరస్పాండెంట్ రజనీ, ప్రిన్సిపాల్ విజయ్ పాల్గొన్నారు.

సఖి సేవలపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వెన్నంపల్లిలో మంగళవారం సఖి సేవలు, పొదుపు పథకాలు, ప్రభుత్వ పథకాలపై మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టు సుచరిత మహిళలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్లో బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా బాలికలకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ చక్రధర్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఏఎన్ఎంలు స్వప్న, విజయ, రజిత, ఆశావర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి సందర్భంగా పూజలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో ఉన్న అభయాంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం భీష్మ ఏకాదశి సందర్భంగా స్వామివారికి పూజలు, శివాలయంలో రుద్రాభిషేకం చేశారు. హాజరైన భక్తులకు పూజారి మహేశ్ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ ఉన్నారు.

సమ్మక్క జాతరకు అంతా సిద్ధం

- నేడు వనదేవతల జన ప్రవేశం
- గద్దెకు చేరనున్న సారలమ్మ
- ఏర్పాట్లను పరిశీలించిన పోలీసులు, అధికారులు

పెద్దపల్లి జిల్లాలో మూడు రోజుల పాటు జరిగే సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణకు అధికారులు, పోలీసులు, జాతర కమిటీలు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వనదేవతల జాతర కనుల పండువగా జరుగుతుంది. ముఖ్యంగా గోదావరిఖని, సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్ల, ఓదెల మండలం కొలనూర్‌లో జాతర ఘనంగా జరుగుతుంది. ఇక్కడికి భక్తులు లక్షల సంఖ్యలో వచ్చి వనదేవతలను దర్శించుకుంటారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాతర కమిటీలు, అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం సారలమ్మను గద్దె మీదికి తీసుకువస్తారు.



సుల్తానాబాద్‌రూరల్: ముస్తాబైన గర్రెపల్లిలోని సమ్మక్క–సారలమ్మ గద్దెలు

పటిష్ట బందోబస్తు ఏర్పాటు



సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులు వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేసుకోవాలి. ఇతరులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించొద్దు. జాతర ప్రాంగణంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ఇబ్బందులెదురైతే జాతర కమిటీ సభ్యులకు, పోలీసులకు సమాచారమివ్వాలి. – గజ్జి కృష్ణ, ఏసీపీ, పెద్దపల్లి

పెద్దపల్లి మండలంలో..

పెద్దపల్లిరూరల్: మండలంలోని హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట, పెద్దకల్వల గ్రామాల్లో సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. హన్మంతునిపేట గ్రామశివారులో సమ్మక్క జాతర 42 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. భక్తులందరికీ మెరుగైన వసతులను జాతర కమిటీ చైర్మన్ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టారు. తుర్కలమద్దికుంట గ్రామశివారులోని పెద్దగుట్ట వద్ద జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పెద్దకల్వలలోని హుస్సేనిమియా వాగు ఒడ్డున జాతర నిర్వహిస్తున్నారు.

నేడు గద్దెకు చేరనున్న సారలమ్మ

సుల్తానాబాద్‌రూరల్: వనదేవతల జాతర బుధవారం నుండి ప్రారంభమవుతుంది. దీంతో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేశారు. గర్రెపల్లి, నారాయణపూర్, తొగర్రాయిలో ఏర్పాట్లను పూర్తి చేశారు.

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి–ఎలిగేడు గ్రామాల సరిహద్దున గల పెండ్లి పోరుగుట్ట వద్ద జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్తి చేశారు.

కమాన్‌పూర్: మండలంలోని గుండారంలో జాతర ఏర్పాట్లను పూర్తి చేశారు.

జూలపల్లి: అబ్బాపూర్, తేలుకుంట గ్రామాల్లో జాతర ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో జరిగే జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి శనివారం వరకు జరిగే జాతర కోసం చైర్మన్ దేవిడి శ్యాంరెడ్డి, పాలకవర్గసభ్యులు, అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



ఎలిగేడులో సమ్మక్క–సారలమ్మ గద్దెలు



ఓదెల: కొలనూర్‌లో ముస్తాబైన గద్దెలు



జూలపల్లి: అబ్బాపూర్‌లో పూర్తయిన ఏర్పాట్లు

వనదేవతల జాతర ఏర్పాట్లపై సమీక్ష



రామగుండం: భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేస్తున్న ఏసీపీ రమేశ్



ఓదెల: కొలనూర్ జాతర స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ గజ్జి కృష్ణ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గోదావరి ఒడ్డున జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరలో భద్రతా ఏర్పాట్లపై మంగళవారం గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ భద్రతా ఏర్పాట్లపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. జాతరలో సీఐ–1, ఎస్సైలు–2, ఏఎస్సైలు/హెడ్‌కానిస్టేబుల్స్–16, కానిస్టేబుల్స్–26, హోంగార్డులు–3, మొత్తంగా 50మంది పోలీసు సిబ్బందిని విధుల్లో కొనసాగించనున్నట్లు వెల్లడించారు. జాతర ప్రాంగణంలో 16 సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామన్నారు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై బోయ వెంకట్ ఉన్నారు. భక్తులకు అత్యవసర భద్రత సేవల నిమిత్తం గోదావరిఖని ఏసీపీ నంబర్ 87126 56515, సీఐ 87126 56524, ఎస్సై 8712656527తో పాటు డయల్ 100కు ఫోన్ చేసే చేయాలని సూచించారు.

పోలీసుల బందోబస్తు

ఓదెల: సమ్మక్క జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలతో పాటు పోలీసుల బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని కొలనూర్ సమ్మక్క జాతర ఏర్పాట్లను సందర్శించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సుల్తానాబాద్ సీఐ జగదీశ్, పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె సంజీవరెడ్డి, జాతర మాజీ చైర్మన్ సామ చిన్నయ్య, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

గోదావరిఖనిటౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేశ్ అన్నారు. మంగళవారం స్థానిక మార్కండేయకాలనీలోని శ్రీలక్ష్మి ఫంక్షన్‌హాల్లో జరిగిన కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల ఫ్లెడ్జిలింగ్ ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.

ఎన్‌సీసీ కేడెట్, ఆఫీసర్‌కు అభినందనలు



అభినందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖనిటౌన్: నగరంలోని సెక్రెడ్ హార్ట్ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ ఎస్‌కే రిజియాన్, ఎన్‌సీసీ ఆఫీసర్ జ్యోత్స్నను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ అభినందించారు. జనవరి 26న ఢిల్లీ రిపబ్లిక్ పరేడ్‌కు రిజియాన్ ఆర్మీవింగ్ తరఫున ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ నుంచి అర్హత సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు ఎమ్మెల్యే అభినందించారు.

ఉత్పత్తి లక్ష్యం అధిగమించాలి



డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్ఈ విజేందర్

రామగుండం: ఆర్థిక సంవత్సరాంతానికి నిర్దేశిత విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం అధిగమించాలని రామగుండం బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్ కోరారు. మంగళవారం తన చాంబర్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరించి మాట్లాడారు. లైజన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, ఈఈ(సివిల్) సూర్యనారాయణరెడ్డి, డి.శంకరయ్య, అసోసియేషన్ అధ్యక్షుడు లగిశెట్టి రవికుమార్, బొడ్డు యాదగిరి, గోలి నాగమల్లు, మల్లేశం, చారి, రాజేశ్, దాసి రాకేశ్, శ్రీనివాస్, నర్సింహులు, రమేశ్, శంకర్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో మహిళలకు చేయూత

రామగుండం: ఆర్థిక అక్షరాస్యతతోనే మహిళలకు చేయూత లభిస్తుందని, ఆర్థిక అంశాలపై మహిళలకు అవగాహన ఉన్నప్పుడే సంపూర్ణ లబ్ధి చేకూరుతుందని జిల్లా మహిళా సాధికారిక కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. ఈ మేరకు మంగళవారం అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో వీఏవోలతో సమావేశమయ్యారు. జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సఖి, అంగన్‌వాడీ, చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్స్ తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రవి, ఏపీఎం సంది నర్సమ్మ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

23న పెద్దపల్లిలో మాదిగల జోడోయాత్ర

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లికి 23న మాదిగల జోడోయాత్ర చేరుకుంటుందని జిల్లా జేఏసీ అధ్యక్షుడు సంపత్ తెలిపారు. మంగళవారం ఆయన పెద్దపల్లిలో మాట్లాడారు. మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. మాదిగలను ఐక్యం చేసేందుకే జోడో యాత్ర చేపట్టామని, 21న హైదరాబాద్‌లో ఆరంభమై 23న పెద్దపల్లికి చేరుతుందన్నారు. మాదిగలంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు సదానందం, కమల్, శ్రీనివాస్, సాయి, వంశీ, గట్టయ్య, సురేందర్ ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వహించేందుకు ఉత్సాహవంతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి సంపత్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు స్వచ్ఛందంగా భోజన నిర్వహణ కార్యక్రమాన్ని మానివేసినందున నూతన ఏజెన్సీ నిర్వాహకులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. బసంత్‌నగర్‌లో మహిళ సమైక్య సంఘంలో సభ్యురాలుగా ఉన్న మహిళలు ఎవరైనా ఇందుకు దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు బసంత్‌నగర్‌లోని మండల విద్యాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బస్టాండ్‌లో మూడురోజులు అన్నదానం

మంథని: మేడారం భక్తుల సౌకర్యార్థం మంథని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మూడురోజులు అన్నదానం నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2.30 వరకు అన్నదానం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత తాగునీరు

గోదావరిఖనిటౌన్: మేడారం జాతర సందర్భంగా గోదావరిఖని బస్టాండ్‌లో రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత తాగునీరు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. దాతలు లయన్ బెణిగోపాల్, లయన్ అన్నపూర్ణాదేవి త్రివేది ఆధ్వర్యంలో 20 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి 5గంటల వరకు మేడారం భక్తుల కోసం ఉచిత తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జాతరకు బందోబస్తు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం, పేంచికల్‌పేట గ్రామాల్లో బుధవారం నుంచి జరిగే సమ్మక్క–సారలమ్మ జాతరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై మామిడాల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం నుంచి జరిగే జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, గొడవలు జరగకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. జాతరను ప్రశాంత జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

అంతర్గాంలో కళాజాత

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని అంతర్గాంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి బృందం కళాకారులు కళాజాత ప్రదర్శనలతో పలు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దయానర్సింగ్, బుర్ర శంకర్‌గౌడ్, సానకొండ రవీందర్, ఢిల్లీ వెంకటస్వామి, స్పందన, నారగోని సరిత, స్వప్న, శ్వేత, స్పందన ఉన్నారు.

హరిహర దేవాలయంలో బ్రహ్మోత్సవాలు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ హరిహర దేవాలయంలో మంగళవారం శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు యెరబాటి రాజేశ్వర్‌రావు, హైకోర్టు న్యాయవాది యెరబాటి అశోక్‌రావు దంపతులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, రుత్వికులు ప్రవీణ్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలి

సుల్తానాబాద్: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు కోరారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పార్టీ నిర్వహించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

మీర్జంపేటలో ఎల్లమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మీర్జంపేట గ్రామంలో మంగళవారం గౌడ కులస్తులు ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించారు. ఎంపీటీసీ జనార్దన్ రెడ్డి, మాజీ సర్పంచు నాగార్జున్‌రావు, నాయకులు సదానందంగౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలులో అధికారులు శ్రద్ధ చూపి అర్హులైన వారికి వాటి ఫలాలు అందేలా చూడాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పలుశాఖల అధికారులతో సమావేశమై సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ పథకాన్ని అర్హులైన వారు వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లపై శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ ఎంపీడీవో ఎంపీవోలకు సూచించారు.

అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: అధికారులు, సిబ్బంది ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కారాదని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మున్సిపల్‌కు సంబంధించిన అన్ని అంశాలపై సిబ్బందికి అవగాహన ఉండాలని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో, పన్నులు వసూలు చేయడంలో మున్సిపల్ సిబ్బంది పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, సెక్రటరీ రాజు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సూపరింటెండెంట్ మనోహర్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగాల కుంభకోణంపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న కందుల సంధ్యారాణి

గోదావరిఖని: ఎన్టీపీసీ ఉద్యోగాల కుంభకోణంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి పార్టీ నాయకురాలు కందుల సంధ్యారాణి ఫిర్యాదు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వివరాలు తెలిపారు. కేంద్రమంత్రి స్పందిస్తూ విజిలెన్స్ ఎంక్వైరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

కార్మికులకు సేవ చేయడమే జీవిత లక్ష్యం



సన్మానిస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

జ్యోతినగర్: కార్మికులకు సేవ చేయడమే జీవిత లక్ష్యమని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ సంస్థ కన్నతల్లి లాంటిదని, కార్మికులందరూ సహోదరులని వారికి ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఐఎన్టీయూసీ పాత్ర అమోఘమని కొనియాడారు. అనంతరం బాబర్‌ను ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి బండారు కనకయ్య, కొలిపాక మల్లయ్య, కందుల స్వామి, ఆరెపల్లి రాజేశ్వర్, ముత్యాల శ్రీనివాస్ సన్మానించారు. కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు మేలు



మాట్లాడుతున్న ఉమేశ్‌రావు

పెద్దపల్లిరూరల్: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందని, ఈ విషయాన్ని గుర్తించిన ప్రజలు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించి తమ పార్టీకి అధికారం అప్పగించారని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉమేశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు మేలు కలుగుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు బడాబాబులకే ప్రయోజనాలు కలిగించేలా ఉన్నాయని ఆరోపించారు. సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఆయన కోరారు. కాంగ్రెస్‌కే మెజార్టీ స్థానాలను కట్టబెట్టి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, నాయకులు అక్బర్‌అలీ, సంపత్, శ్రీనివాస్, మస్రత్, సునీల్‌గౌడ్, శ్రీకాంత్, మహేశ్, విజయ్‌సింగ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వేణుమాధవ్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పనులను మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం మెయిన్ రోడ్ల వెంట చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను పారేయకుండా చర్యలు తీసుకోవాలని ఇంటి యజమానులకు సూచించారు. రహదారుల వెంబడి చెత్తను ఇంటి యజమానులు వేస్తే వారికి జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. శానిటరీ సూపర్‌వైజర్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష



సమావేశం నిర్వహిస్తున్న డైరెక్టర్ తరుణ్

గోదావరిఖని: మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ తరుణ్ కత్తుల మంగళవారం ఆర్జీ–1 ఏరియాను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడిపల్లి ఓసీపీని సందర్శించారు. ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్, మైన్స్ క్లోజర్ ఆక్టివిటీస్‌పై జీఎం కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్లాంటేషన్, సెటిలింగ్ పాండ్, అటవీ విస్తరణకు అనువైన పరిస్థితులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎం గణపతి ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం



సన్మానిస్తున్న గౌడ సంఘం సభ్యులు

రామగిరి: మండలంలోని కల్వచర్ల మాజీ సర్పంచ్ గంట పద్మను మంగళవారం గౌడ సంఘం సభ్యులు రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ఆవరణలో సన్మానించారు. గౌడ సంఘం అధ్యక్షుడు కాట రాజేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ముత్యం సతీశ్‌గౌడ్, గౌడ సంఘం సభ్యులు బూరుగు భూమయ్యగౌడ్, కాట శంకర్‌గౌడ్, కాట మల్లయ్యగౌడ్, జవాజి శ్రీనివాస్‌గౌడ్, బూరుగు సదానందంగౌడ్, ఆరెల్లి ప్రవీణ్‌గౌడ్, పూరెల్ల అనిల్‌గౌడ్, తాటి సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.